క్లుప్తంగా

నేడు బడుగు రామరాజ్యం వర్ధంతి

కొయ్యూరు: మాజీ ఎంపీపీ, బడుగు రామ రాజ్యం వర్ధంతిని బుధవారం కించవానిపాలెంలో నిర్వహిస్తున్నట్టు ఆయన సోదరుడు, ఎంపీపీ బడుగు రమేష్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇప్పించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు.భూ సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. ఆయన సేవలు గిరిజనుల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నాయన్నారు.

షాక్ కొడుతున్న సెల్ టవర్‌తో ప్రమాదం


సెల్ టవర్ వద్ద షాక్‌కు గురై మృతి చెందిన పశువు (ఫైల్)

గూడెంకొత్తవీధి: మండలంలోని సంకాడ పంచాయతీ గోవాడ గ్రామంలో నిర్మించిన సెల్ టవర్ షాక్ కొడుతుంది. సెల్ టవర్‌కు ఆనుకుని ఉన్న ఇక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. దీంతో అక్కడకు సమీపంలోకి వెళ్లే సరికే షాక్ కొడుతోందని స్థానికులు చెబుతున్నారు. తాజాగా అక్కడ విద్యుదాఘాతానికి గురై ఒక ఎద్దు చనిపోయిందని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఈ పరిసరాల్లోకి వెళ్లాలంటేనే అంతా ఆందోళన చెందుతున్నారు.విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సెల్ టవర్ వద్ద షాక్ కొట్టకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

72 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టులో మంగళవారం కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.72 మందికి వైద్య సేవలు అందించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉన్న వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని గ్రామస్తులకు వైద్యాధికారి శిరీష సూచించారు. ఎంఎల్‌హెచ్‌పి లలిత,హెల్త్ అసిస్టెంట్ అశోక్,ఏఎన్‌ఎంలు సుశీల, పుణ్యవతి, 104 సిబ్బంది కృష్ణవేణి, గణపతిలు పాల్గొన్నారు.

అల్లూరి సంఘం రాక రేపు

పాయకరావుపేట: ఈ నెల 23న అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ప్రతినిధుల బృందం మండలంలోని సీతమ్మకొండకు రానున్నట్లు సంఘ కార్యదర్శి లక్కోకుల బాబ్జి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోపాలపట్నం గ్రామం వద్దనున్న సీతమ్మకొండ(పాండవుల మెట్ట)పై అల్లూరి సీతారామరాజు పూజలు, తపస్సు చేసినట్లు చరిత్ర చెప్తోందన్నారు. కొండపైనున్న ఉమా ధర్మలింగేశ్వరస్వామి ఆలయాన్ని, అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రదేశాన్ని బృందం పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పర్యటనలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు, మహర్షి సినిమా ఫేమ్ రాంపల్లి వెంకటరమణ బృందం హాజరుకానున్నట్లు తెలిపారు.

ఫణిభూషణ్‌కు జీవ వైవిధ్య పురస్కారం



అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల పంచాయతీ చిన్నబాబుకాలనీకి చెందిన కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌కు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖలోని ఏయూలో రాష్ట్ర స్థాయి అవార్డును బుధవారం అందుకోనున్నట్లు గ్రీన్ క్లబ్ ప్రతినిధి ఎస్.ఎఫ్.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2000 సంవత్సరం నుంచి జీవ వైవిధ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం, సాంప్రదాయక విజ్ఞానం ద్వారా జాగృతి కార్యక్రమాలు చేపట్టడంతో ఆయనకు ఈ పురస్కారం దక్కిందన్నారు.

ఘనంగా అమ్మవారి జాతర

ఎస్.రాయవరం: రేవుపోలవరంలో మంగళవారం బంగారమ్మతల్లి జాతర నిర్వహించారు. మత్స్యకార ఆరాధ్య దైవం అయిన అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. దీంతో అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.


కొత్తవలస గెడ్డపై కానరాని వంతెన (నాడు)


కొత్తవలస గెడ్డపై వంతెన నిర్మాణ పనులు (నేడు)


రేగ గ్రామంలోని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రీప్రైమరీ స్కూల్

అభివృద్ధి పరవళ్లు


ఏకలవ్య పాఠశాల


బొండం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి

- ప్రగతి పథంలో బోండం పంచాయతీ
- రూ..38.44కోట్లతో రహదారులు, వంతెనల పనులు
- ఏకలవ్య పాఠశాల నిర్మాణం
- ఆనందంలో గిరిజనులు

అరకులోయ రూరల్: నాడు బోండం పంచాయతీకి వెళ్లాలంటే..నరకయాతనే.. గోతులతో కూడిన మట్టి రోడ్డుపై నానా అవస్థలతో గ్రామస్తులు రాకపోకలు సాగించేవారు...గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ కేంద్రంతో పాటు ఒక్క గ్రామానికి రహదారి, తాగునీటి సదుపాయం లేదు.. పంచాయతీ పరిధిలో ఉన్న 13 గ్రామాల ప్రజలు ఎక్కడికి వెళ్లాలన్నా కాలినడకే శరణ్యం.. తాగునీటి పథకాలు లేక గెడ్డలను ఆశ్రయించి, కలుషిత నీరు వినియోగించి రోగాల బారిన పడేవారు.. చంద్రబాబు ప్రభుత్వం గిరిజనుల సమస్యలపై ఏనాడు కనీసం స్పందించలేదు. దీంతో ఏళ్ల తరబడి గిరిజనులు సమస్యలతో సావాసం చేశారు...వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గిరిజన గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయి. గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారు. శివారు గ్రామాల్లోనూ కోట్లాది రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పించారు. ఏళ్ల నాటి సమస్యలు పరిష్కారమవడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పంచాయతీలో అభివృద్ధి పనులు

బొండం పంచాయతీలో 13 గ్రామాల్లో సుమారు4700 మంది నివసిస్తున్నారు. పంచాయతీలో పలు గ్రామాలకు కోట్లాది రూపాయలతో రహదారుల నిర్మాణం జరిగింది. ఇందులో భాగంగా రూ.92లక్షలతో గన్నెల నుంచి బొండం వరకు తారురోడ్డు నిర్మించారు. కోటి రూపాయలతో కొత్తవలసకు వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణం చేపడుతున్నారు. బొండంలో రూ,10 లక్షలతో సీసీ రోడ్డు, మజ్జివలస రూ,7లక్షలు, రంపుడువలస రూ,5లక్షలు, కొత్తవలసలో రూ,3లక్షలతో సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటుచేశారు. పంచాయతీ పరిధిలోని రంగినివలసలో రూ.10లక్షలతో చెక్‌డ్యాంను నిర్మించారు. దీంతో రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతోంది. ఏళ్ల తరబడి సాగునీరు అందక ఇబ్బందులు పడ్డ రైతులు ఇప్పుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారు. పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు–నేడు ద్వారా లక్షలాది రూపాయల నిధులను మంజూరు చేశారు. ఇందులో భాగంగా రూ.35కోట్లతో ఏకలవ్య పాఠశాలను నిర్మించారు. ఉత్తమ విద్యా ప్రమాణాలతో విద్యార్థులకు ఇక్కడ విద్య అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి ఈ పాఠశాల అందుబాటులో రానుంది.

ఎన్నడూ లేనంతగా అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరిగింది. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కనీస సదుపాయాలు ఉండేవి కావు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో బొండం పంచాయతీలో అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కలిగాయి. రహదారుల నిర్మాణంలో అన్ని ప్రాంతాలకు రవాణా మెరుగుపడింది. చాలా ఆనందంగా ఉంది.

–గొల్లోరి గోపాల్, గ్రామస్తుడు,బొండం

గ్రామాల్లో విప్లవాత్మకమైన మార్పు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో శివారు గ్రామాలు అభివృద్ధి చెందాయి. ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌తో గిరిజనులకు తాగునీటి కష్టాలు తప్పాయి. రవాణా సౌకర్యం అందుబాటులో రావడంతో రైతులు పండించిన పంటలను వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి విక్రయించుకుంటున్నారు. చాలా ప్రాంతాలకు బస్సు సర్వీసులు వచ్చాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో విప్లవాత్మకమైన మార్పులు కనిపిస్తున్నాయి. పాఠశాలలు బాగుపడ్డాయి.

–శంకర్‌రావు, గిరిజనుడు,బొండం పంచాయతీ


బొండం పంచాయతీ కేంద్రంలో రక్షిత తాగునీటి పథకం


నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం

క్రీడలతో మానసిక ఉల్లాసం


పోస్టర్ ఆవిష్కరించిన చింతపల్లి సీఐ రమేష్, ఎస్‌ఐ అరుణ్ కిరణ్ తదితరులు

చింతపల్లిరూరల్: మండలంలోని తాజంగిలో పెటియ సత్తిబాబు జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ బుధవారం నుంచి ప్రారంభమవుతున్నట్టు నిర్వాహకులు కౌషిక్, సురేంద్ర, సాగర్ తదితరులు చెప్పారు. ఈ టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను చింతపల్లి సీఐ రమేష్, ఎస్‌ఐ అరుణ్‌కిరణ్, గ్రామ పెద్దలు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్, ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పలువురు గ్రామపెద్దలు మాట్లాడుతూ సత్తిబాబుకు క్రికెట్ క్రీడపై ఉన్న మక్కువను గుర్తించి టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. టోర్నీ నిర్వాహకులు మాట్లాడుతూ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండవ బహుమతిగా రూ.5వేలు అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల టీమ్‌లో టోర్నీలో పాల్గొవచ్చన్నారు.

లారీపై పడిన విద్యుత్ స్తంభం

త్రుటిలో తప్పిన ప్రమాదం


టిప్పర్‌పై కూలిన విద్యుత్ స్తంభం

రాజవొమ్మంగి: స్థానిక 33/11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై గల విద్యుత్ స్తంభం మంగళవారం ఆ మార్గంలో వెళ్తున్న క్వారీ లారీపై పడింది. వెంటనే కరెంటు సరఫరా నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. రాజవొమ్మంగి నుంచి ఏలేశ్వరం వైపు కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్‌పై విద్యుత్ స్తంభం ఒక్కసారిగా పడిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకొంది. ఎవరికి ఏ అపాయం జరుగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకొన్నారు. స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. క్వారీ లారీపై విద్యుత్ స్తంభం కూలిపోవడంతో ప్రధాన విద్యుత్ వైర్లు రోడ్డుపై తెగి పడ్డాయి. దీంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంకాలం 5 నుంచి రాత్రి 9 గంటలు అయినా విద్యుత్ సరఫరా లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతరం విద్యుత్ శాఖాధికారులు స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు.

మ్యుటేషన్ ప్రక్రియపై సూచనలు


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లిరూరల్: మ్యుటేషన్ జరిగినప్పుడు ఎల్‌పీ నంబర్, భూమి స్కెచ్ తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ టి.రామకృష్ణ అన్నారు. స్థానిక కార్యాలయంలో వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్, విలేజ్ అసిస్టెంట్లతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యూటేషన్ విషయంలో వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్లు,విలేజ్ అసిస్టెంట్ల సమక్షంలో మ్యుటేషన్ ప్రక్రియ జరగాలని సూచించారు. కొలతలు తీసుకునేటప్పుడు తప్పనిసరిగా భూమి సరిహద్దుల యజమానులకు సమాచారం అందించాలన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

వైభవంగా గజ్జాలమ్మ ఉత్సవం


గజ్జాలమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్న భక్తులు


ప్రత్యేకాలంకరణలో ఆలయం

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో రెండేళ్లకోసారి నిర్వహించే గజ్జాలమ్మ ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని, ఆలయాన్ని పూలమాలలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరై అమ్మ వారిని దర్శించుకున్నార. చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ ఎస్.శివ, ఎంపీటీసీ సభ్యురాలు కన్నూరు అచ్చియమ్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారి జాతర ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఘటాలతో అమ్మవారిని ఊరేగించారు. ఉత్సవం సందర్భంగా ఆలయం నుంచి గ్రామ శివారు వరకు విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన వివిధ దేవతామూర్తుల కటౌట్లు ఆకట్టుకున్నాయి. ప్రజలు ఉత్సాహంగా ఉత్సవంలో పాల్గొన్నారు.

పీఎండీఎస్ విత్తనాల సాగుతో భూములు సారవంతం


సుందరయ్యపేటలో పీఎండీఎస్ విత్తనాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కశింకోట: ప్రకృతి వ్యవసాయ పద్ధతిల ద్వారా తమ పంట భూములను రైతులు సారవంతం చేసుకోవాలని మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు, ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి కూండ్రపు అరుణ సూచించారు. మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులకు తొలకరిలో భూమిని సారవంతం చేసుకునేందుకు ఉపకరించే పీఎండీఎస్ 30 రకాల కూరగాయల విత్తనాల కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సీహెచ్ లత్సన్న ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో పీఎండీఎస్ విత్తనాల సాగుపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట భూములను సారవంతం చేసుకోవడానికి పీఎండీఎస్ విత్తనాలను తొలకరి వర్షాల్లో జల్లుకోవాలన్నారు. ఇవి 45 రోజుల్లో ఏపుగా ఎదుగుతాయన్నారు. వీటిని నేలలో కలియ దున్నుకుంటే సహజసిద్ధ ఎరువుగా ఉపయోగపడతాయన్నారు. హానికరమైన కృత్రిమ ఎరువులు వాడాల్సిన పని ఉండదన్నారు. ఎకరా భూమికి 12 కిలోల పీఎండీఎస్ విత్తనాలు సరిపోతాయన్నారు. వీటిని ఒక కిట్‌గా రూ.800కే ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. వీటిని ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న 13 గ్రామాల రైతులు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సాగు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పండగ


ఘటాల ఊరేగింపులో భక్తులు

కొయ్యూరు: కినపర్తి పంచాయతీ చుట్టుబందలో మంగళవారం ఒప్పకొండమ్మ తల్లి పండగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

భక్తిశ్రద్ధలతో లోవాంబిక పుట్టుక మహోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి: మండలంలో గోకివాడ గ్రామంలో మంగళవారం లోవాంబిక అమ్మవారి పుట్టుక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారు అర్ధరాత్రి దాటాక భక్తులకు మెరుపుల రూపంలో దర్శనమిస్తారని నియోజక వర్గ సచివాలయ కన్వీనర్ ఎన్‌వీ సూర్యనారాయణ, సర్పంచ్ నీరుకొండ శారద తెలిపారు. జూన్ 18న అనుపు మహోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కనులపండువగా ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం విజ్ఞాన సమితి వద్ద నున్న అభయాంజనేయస్వామి ఆలయ 7వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు తెల్లవారు జాము నుంచే స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చందు, హరి, ఉషాసాగర్, బాలు, మధు, దాడి శ్రీను, లక్ష్మణరావు, బుద్ద మోహన్, కొయిలాడ పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు


రాజకీయ పార్టీ నాయకులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

వై.రామవరం: జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వ హణకు అందరూ సహకరించాలని స్థానిక ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్ కోరారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో వేర్వేరుగా మంగళవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతు జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు అందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. ఏవిధమైన అవాంచనీయ సంఘటనలకు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపునకు అందరూ సహకరించాలన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు వంటివి నిర్వహించొద్దన్నారు. జూన్ 5వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు పలు సలహాలు సూచనలిచ్చారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే


ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

అరకులోయ రూరల్: మండలంలో పద్మాపురం, చినలబుడు పంచాయతీల సరిహద్దు రణజిల్లేడ, మాలిసింగరం ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కల్వర్టు అంచు భాగం కోతకు గురైంది. వాహనచోదకులు, పాదచారులు ఆదమరిస్తే ప్రమాద బారిన పడే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళలో ఈ మార్గం మీదుగా వెళ్లే వాహనచోదకులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ హెచ్చరిక బోర్డు కూడా లేదంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు, పాదచారులు కోరుతున్నారు.

వరి నారుమడులకు సన్నద్ధం


వరినారు మడి

మాడుగుల రూరల్: ముందస్తుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు. మండలంలో 15 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి పంట వేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ముందుగా కురిసిన వర్షాల వల్ల ట్రాక్టర్ల సహాయంతో దుక్కులు దున్నిస్తున్నారు. దీంతోపాటు చెరకు నాట్లు వేయడానికి గాను దుక్కులు దున్నుతున్నారు. ప్రస్తుతం రైతులు మెట్ట భూముల్లో సరుగుడు నారు వేస్తున్నారు.

వసంతోత్సవం రేపు

కశింకోట: రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో 23న నాగవల్లి వసంతోత్సవం నిర్వహిచనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీరామాచార్యులు మంగళవారం తెలిపారు. వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆ రోజు ఉదయం 8.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.